ప్రజాశక్తి
బుధవారం 12 మార్చి 2025
5
శ్రీకాకుళం

నేడు యువత పోరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలో పేద విద్యార్థులు, నిరుద్యోగులను నయవంచనకు గురిచేసిన టిడిపి కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మెగా డిఎస్‌సి పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తొలి సంతకానికి నేటికీ అతీగతి లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగ యువత, వైసిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేట నిషేధ సాయంపై అస్పష్టత

- ఇటీవల బడ్జెట్‌లో అర్హుల సంఖ్యను ప్రకటించిన ప్రభుత్వం
- గతేడాది పెండింగ్ సాయమే చెల్లిస్తుందంటూ ప్రచారం
- 2025 బ్యాన్ పీరియడ్ సొమ్ములుపై రాని స్పష్టత
- ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండు పర్యాయాలు ఇవ్వడంపై సందేహాలు

చేపల వేట నిషేధం సాయం మేలో అందిస్తామంటూ ప్రభుత్వం పలు సందర్భాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. 2021 నుంచి ప్రతి ఏడాదీ మేలో డబ్బులు చెల్లించే పరిస్థితి ఉన్నా, గతేడాది ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం తలమునకలై ఉండడంతో మత్స్యకారులకు సకాలంలో డబ్బులు జమ కాలేదు. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ వాయిదాలు వేస్తూ వచ్చింది. చివరకు ఇటీవల వ్యవసాయ బడ్జెట్‌లో వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సాయం అందించనున్న లబ్ధిదారుల సంఖ్యను సైతం ప్రకటించడంతో గంగపుత్రుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. గతేడాది పరిహారం డబ్బులు మేలో ఇస్తారా?, చెల్లించనున్న సొమ్ములు ఈ ఏడాది నిషేధ సమయం పరిహారమా అన్న సందిగ్ధత అందరిలోనూ నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి రూ.పది వేలు చొప్పున ఏటా క్రమం తప్పకుండా అందిస్తోంది. 2023 సంవత్సరానికి సంబంధించి ఆ ఏడాది మే మూడో వారంలోనే చెల్లింపులు జరిగాయి. 2024 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం డబ్బులు ఇవ్వలేదు. కొన్ని పాలనాపరమైన ఇబ్బందులతో పాటు టిడిపి కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తుండడంతో, మత్స్యకారులు గతేడాది సాయానికి నోచుకోలేకపోయారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో లబ్ధిదారుల సర్వేను చాలా ఆలస్యంగా చేపట్టడంతో గతేడాది జూన్ రెండో తేదీన అధికారులు జాబితాను పంపారు.

రాష్ట్రంలో గతేడాది జూన్‌లో కొత్తగా కొలువుదీరిన టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లింపులు మాని రీ సర్వే చేయాలని అధికారులను ఆదేశించడంతో చెల్లింపులు వాయిదా పడ్డాయి. రీసర్వే పూర్తయిన తర్వాత జనవరిలో ఇస్తామని ఒకసారి, ఏప్రిల్‌లో చెల్లిస్తామంటూ మరోసారి మాట మారుస్తూ వచ్చింది. ఇప్పుడు తాజాగా మేలో చెల్లిస్తామంటూ బడ్జెట్‌లో పేర్కొంది.

వేట నిషేధ సాయంపై అస్పష్టత

వేట నిషేధ పరిహారానికి గత ప్రభుత్వం మే రెండో తేదీన మొదటిసారి సర్వే నిర్వహించింది. జూన్ రెండో తేదీ నాటికి ప్రాథమిక జాబితా పూర్తయింది. ఆ జాబితా ప్రకారం జిల్లావ్యాప్తంగా 15,345 మంది మత్స్యకారులను అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వ సూచనతో అధికారులు మరోసారి రీ సర్వే చేసి జాబితాలో తప్పిపోయిన మరో 55 మందిని గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో మొత్తం 15,400 లక్షల మంది లబ్ధిదారులు అర్హత సాధించినట్లయింది.

అసెంబ్లీలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎంతమందికి పరిహారం అందించనున్నారో కచ్చితమైన సంఖ్యను సైతం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,22,968 మందికి రూ.20 వేలు చొప్పున వేట నిషేధ సాయం అందించేందుకు బడ్జెట్‌లో రూ.245.936 కోట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. వేట నిషేధ సాయం ఎంతమందికి ఇస్తారో స్పష్టంగా చెప్పారు. అంటే ఇది గతేడాది సాయంగానే పరిగణించాల్సి ఉంటుంది. మరి ఈ ఏడాది బ్యాన్ పీరియడ్ సర్వే, లబ్ధిదారుల గుర్తింపు, వారికి సాయం ఎప్పుడు అందిస్తారనేది స్పష్టత లేదు. బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే ఒకే ఏడాది రెండు పర్యాయాలు డబ్బులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

వడపోతలో పాత విధానమే

మత్స్యకార భరోసాకు గత వైసిపి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలనే టిడిపి కూటమి ప్రభుత్వమూ అమలు చేయాలని నిర్ణయించింది. పల్లం భూమి మూడు ఎకరాలు గానీ మెట్టు పదెకరాలకు మించి ఉన్న వారిని, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారిని కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి వాడిన వారిని అనర్హులుగా పేర్కొన్నారు. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులుగా గుర్తించనున్నారు. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే వారికీ పథకం వర్తింపజేయకూడదని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ద్వారా వీటిని ఇప్పటికే వడపోసినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది

వేట నిషేధ సాయం కోసం గతేడాది మేలో సర్వే చేసి జూన్‌లో అర్హుల జాబితా పంపాం. ప్రభుత్వ సూచనతో మరోసారి రీ సర్వే ఆగస్టులో మరో 55 మందిని అర్హులను గుర్తించి నివేదించాం. మత్స్యకారులకు వేట నిషేధ సాయాన్ని మేలో అందే అవకాశాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

- పి.శ్రీనివాసరావు,
మత్స్యశాఖ ఉప సంచాలకులు

ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రభుత్వరంగ బ్యాంకుల నిర్వీర్యానికి కుట్ర

యుబిఐ రీజనల్ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ కన్వీనర్ బి.శ్రీనివాసులు విమర్శించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపుమేరకు నగరంలోని సింహద్వారం వద్ద గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగులు, అధికారులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ బ్యాంకులపై ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బ్యాంకు అధికారులు, ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తగినన్ని కేడర్లలో వెంటనే రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఐ బోక్ రీజనల్ కార్యదర్శి కె.తేజేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు వచ్చే జీతంపై టాక్స్ భరిస్తున్నారని, దీనికి భిన్నంగా ఉద్యోగుల రుణాలపై టాక్స్ వసూలు చేయాలని బ్యాంకింగ్ యాజమాన్యాలు ఆలోచిస్తున్నాయన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత రుణాలపై టాక్స్‌లను బ్యాంకులే భరించాలన్నారు. కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు గిరిధర్ నాయక్ మాట్లాడుతూ బ్యాంకుల్లో టెంపరరీగా పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు యాజమాన్యాలు తాత్కాలిక నియామకాలు చేయకూడదని శాశ్వత నియామకాలు చేపట్టి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ధర్నాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు జి.కరుణ, ఇండియన్ బ్యాంక్ మహిళా కన్వీనర్ శ్రావణి, కోఆర్డినేషన్ జాయింట్ కార్యదర్శి ఎ.సూర్య, ఒబిసి ఉద్యోగ సంఘ నాయకులు సూర్యకిరణ్, నరేష్ శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో విద్యార్థులకు సాంకేతిక విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పీకర్ ద్వారా విద్యా శాఖామంత్రిని కోరారు. మంగళవారం ప్రభుత్వ సాంకేతిక విద్యా వ్యవస్థల ఏర్పాటు, ఆవశ్యకతపై అసెంబ్లీలో మరో సారి గళమెత్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. మహిళల చదువుకు అవరోధం లేకుండా ఉండేందుకు మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

'కేశవరెడ్డి' బాధితులకు న్యాయం చేయాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేశవరెడ్డి విద్యాసంస్థల యాజమాన్యం ఉత్తరాంధ్ర జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు అన్యాయం చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కేశవరెడ్డి డిపాజిట్ల అంశాన్ని మంగళవారం ప్రస్తావించారు. 2010లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.కోట్ల విలువైన డిపాజిట్లు సేకరించి విద్యార్థుల తల్లిదండ్రులను మోసగించారని ప్రస్తావించారు. సుమారు 800 మంది నుంచి రూ.రెండు లక్షల నుంచి రూ.8 లక్షల వరకు డిపాజిట్లు వసూలు చేశారన్నారు. మొత్తం రూ.42 కోట్ల వరకు కలెక్షన్ చేసి 14 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు తిరిగి చెల్లించలేదని ప్రస్తావించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ప్రాంసరీ నోట్లు, చెక్కులు ఇచ్చారని, డిపాజిట్లు చెల్లించిన వారు పేద కుటుంబాల వారేనని గుర్తుచేశారు. ఈ విద్యాసంస్థపై 15 కేసులు నమోదైనా విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరగలేదన్నారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి దృష్టిసారించి కేశవరెడ్డి స్కూల్ బాధితులను ఆదుకోవాలని కోరారు.

రేపు ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా ఈనెల 13న సోంపేటలోని ఎంఎంఎస్‌లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పేటీఎం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్, వెహికల్ క్లీనర్ వంటి 130 ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుంచి 30 ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.11 వేల నుంచి రూ.19,500 వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించే మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రేషన్ లేదా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బయోడేటాతో రావాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8106508318 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

పోషకాహారాన్ని అందించడమే లక్ష్యం

- మెనూను సక్రమంగా అమలు చేయాలి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా నగరంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండియు) వాహనాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గుడివీధిలోని డిసిఎంఎస్ పౌరసరఫరాల దుకాణాన్ని అక్కడున్న ఎండియు వాహనంలో సరఫరా అవుతున్న సరుకులను పరిశీలించారు. అరసవల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం వంటకాల నాణ్యతను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి ప్రతిరోజూ అందజేస్తున్న ఆహారంపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ సూర్యప్రకాశరావు, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఐసిడిఎస్ సిడిపిఒ శోభారాణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ, సిఎస్‌డిటి చక్రవర్తి, ఎండియూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న కాంతారావు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజలకు మెరుగైన సేవలందించడానికి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, గ్రామ సచివాలయం, డ్వామా, గృహ నిర్మాణం, పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు వంటి అంశాలపై చర్చించారు. పల్లె పండుగ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పని దినాలను పెంచాలన్నారు. గృహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలని చెప్పారు. కాలువలు, చెత్తకుప్పల శుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. చెత్త నుంచి సంపద షెడ్ల నిర్మాణం పూర్తి చేయని 200 పంచాయతీలు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఇంటి నుంచి పని, పి4 సర్వే, ఎంఎస్ఎంఇ సర్వే తదితర అంశాలపై ఆయా అధికారులు సమగ్ర వివరాలు అందించాలన్నారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జిల్లా, మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్ లీఫ్ రేటింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హోటళ్లు, లాడ్జీల యాజమాన్యాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లలో పరిశుభ్రతను నిర్ధారించడం ద్వారా పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పరిచయం చేయబోతున్నామని చెప్పారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానాన్ని పలు విభాగాల్లో అమలు చేస్తామన్నారు. పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించడానికి ఈ రేటింగ్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, జెడ్‌పి సిఇఒ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సభ్యులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో హోటళ్లు, లాడ్జీలను తనిఖీ చేయడానికి ఉప కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించడంలో సహకరించాలని యాజమాన్యాలకు సూచించారు. సమావేశంలో జెడ్పీ సిఇఒ శ్రీధర్‌రాజా, డిపిఒ భారతి సౌజన్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎహసాన్ భాషా, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్ట నాగరాజు, జిల్లా కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి భరోసా

ప్రజాశక్తి - న్యూఢిల్లీ, శ్రీకాకుళం

కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రామ్మోహన్ నాయుడు

జిల్లాలోని మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జల రవాణా శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ సానుకూలంగా స్పందించారు. సుమారు 193 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్రాంతం నుంచి చాలామంది మత్స్యకారులు జీవనోపాధి కోసం గుజరాత్, కేరళ, కర్నాటక వంటి పశ్చిమ తీరప్రాంత రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని మంత్రికి వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం, సంతబొమ్మాళి మండలంలోని భావనపాడులో ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేట, గార మండలంలోని కళింగపట్నంలో ఫిషింగ్ జెట్టీలను నిర్మించాలని మంత్రిని కోరారు. ఈ ప్రాజెక్టుల వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, వలసలు తగ్గి తీరప్రాంత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. ఈ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన మంత్రి సర్బానంద సోనోవాల్‌కి రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ పార్టీల సలహాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీలు, సీనియర్ నాయకుల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నట్లు ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కారం కాని ఏవైనా సమస్యల కోసం భారత ఎన్నికల సంఘం ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలను ఆహ్వానించింది. రాజకీయ పార్టీలకు జారీ చేసిన లేఖలో, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి, పరస్పరం అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో సంభాషణను కూడా కమిషన్ నిర్వహించనుంది. గత వారం నిర్వహించిన భారత ఎన్నికల సంఘం సమావేశంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సంభాషణలు నిర్వహించాలని సూచించారు.

అటువంటి సమావేశాల్లో వచ్చిన ఏవైనా సూచనలను ఇప్పటికే అమల్లో ఉన్న చట్టపరమైన ఛత్రంలో కచ్చితంగా పరిష్కరించాలని, మార్చి 31వ తేదీ నాటికి కమిషన్‌కు తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వికేంద్రీకృత యంత్రాంగాన్ని ముందస్తుగా ఉపయోగించుకోవాలని కమిషన్ రాజకీయ పార్టీలను కోరింది.

కాలువను కప్పేసింది...

గుర్రపుడెక్కతో నిండిన కాలువ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పెద్దజగన్నాథపురం వద్ద ఉన్న కృష్ణసాగరం కాలువ గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో రైతులకు సాగునీటి సమస్య తలెత్తుతుంది. కాలువనిండా గుర్రపు డెక్క దట్టంగా అల్లుకోవడంతో సాగునీటికి అంతరాయం కలిగింది. దీంతో ఈ ప్రాంతంలో 60 ఎకరాల వరకు సాగునీటి వసతి లోపించింది. కాలువ అభివృద్ధి లేకపోవడంతో రైతులకు అందాల్సిన సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఏటా వర్షాధారమే శరణ్యమవుతుంది. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి గుర్రపు డెక్కన్ తొలగించి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే శిరీష

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస : ఉద్దాన ప్రాంతంలో విస్తారంగా సాగు చేస్తున్న జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మంగళవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ జీడి పప్పు ధర బాగానే ఉన్నప్పటికీ పిక్కలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించామన్నారు. అలాగే పలాసలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ నిచ్చామని తెలిపారు. అందుకు సంబంధిత మంత్రి, అధికారులు చొరవ చూపి జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

కంచిలి : మండలంలోని ఎస్.ఆర్.సి.పురం ప్రాథమిక పాఠశాలకు సోంపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు 50 కుర్చీలను మంగళవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పి.ముకుందరావు ఆధ్వర్యాన సంస్థ అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి శివాజీ, కోశాధికారి వెంకటరమణ వీటిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. త్వరలోనే షెడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టంకాల బాబు, లక్ష్మణరావు, ఎస్ఎంసి అధ్యక్షులు కె.కుమారి పాల్గొన్నారు.

కుర్చీలు అందజేస్తున్న ప్రతినిధులు

'యువత పోరు'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ దేవత ఆలయం వద్ద మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నవరత్నాలకు తోడుగా సూపర్ సిక్స్ అంటూ మరో ఆరు హామీలను అదనంగా అమలు చేస్తానని ఎన్నిక సమయంలో మామీనిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా... నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించలేదన్నారు. దీనిపై యువత పోరుకు పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు కాళ్ల సత్యం, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పి.రాజశేఖరరెడ్డి, వైసిపి నాయకులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

నందిగాం: బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని వైసిపి నియోజక వర్గ యువజన అధయక్షులు చిన్న జోగారావు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆమదాలవలస : విద్యార్థుల భవిష్యత్ కోసం బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద చేపట్టనున్న థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. థర్మల్ పవర్ ప్రాజెక్టు వల్ల పర్యావరణ ముప్పు ఉందని, 27 గ్రామాలు ఖాళీ చేయించాల్సి ఉంటుందని

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ, రామారావు

అన్నారు. థర్మల్ ప్రాజెక్టుకు బదులు మూతపడిన ఆమదాలవలస చక్కెర కర్మాగారాన్ని రూ.వెయ్యి కోట్లు ఖర్చుతో తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల రామారావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, బెవర మల్లేశ్వరరావు, గురుగుబిల్లి శ్రీనివాసరావు, పప్పల రమేష్ పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతా రవికుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

పోలాకి: వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని వెదుళ్లవలసలో తన స్వగృహంలో యువత పోరు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ఇబ్బంది పెడుతుందని, దీంతో కళాశాల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనికి నిరసనగా వైసిపి పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, నాయకులు ఆర్.త్రినాథరావు, బచ్చు ఆదినారాయణ రెడ్డి, పైల అప్పన్న, వల్లంనాయిడు, కల్లెపల్లి లక్ష్మణరావు, బంకా చక్రధర్, అసిరినాయుడు పాల్గొన్నారు.

సోంపేట : వైసిపి ఆధ్వర్యాన బుధవారం చేపట్టనున్న యువత పోరును విజయవంతం చేయాలని ఎంపిపి నిమ్మన దాసు, జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.భాస్కరరావు, బి.ధర్మరాజు, యు.కృష్ణారావు, జె.రమేష్, తేజ పట్నాయక్, టి.ఢిల్లీ, భీమారావు, నెహ్రూ, సతీష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : యువత పోరు విజయవంతం చేయాలని కోరుతూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 9 గంటలకు టెక్కలి వైసిపి కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

మెళియాపుట్టి : ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ పోలాకి జైమునిరావు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ట్రైకార్ మాజీ డైరెక్టర్ సవర సుభాష్, సర్పంచ్‌లు వై.ఈశ్వరరావు, తాడేల రామరాజు, మజ్జి రామచందర్ పాల్గొన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని బొన్నికి సవర చిన్నప్పన్న ఐదు లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో మంగళవారం దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. అరెస్టు చేసిన వ్యక్తిని శ్రీకాకుళం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. దాడుల్లో సింగుపురం విఆర్‌ఒ కరణం సూర్యనారాయణ, హెచ్‌సి సోమనాథం, కానిస్టేబుళ్లు దాలినాయుడు, ఊర్మిళ, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన ఆటో

ఆటో దగ్ధం

ఇచ్ఛాపురం : మండలంలోని డొంకూరుకు చెందిన పుక్కల రవికి చెందిన ఆటో మంగళవారం దగ్ధమైంది. ప్రయాణికులతో డొంకూరు నుంచి ఒడిశా వెళ్లాడు. తిరిగి ప్రయాణికులతో వస్తుండగా... పెద్దలక్ష్మీపురం వద్ద ఆకస్మాత్తుగా ఆటోలో నుంచి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను దించేశారు. అనంతరం ఆటో దగ్ధమైంది. రవికి ఆటో జీవనాధారమని, ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన నాయకులు చీకటి కృష్ణయ్య కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

ఆమదాలవలస : మండలంలోని అక్కులపేట ఎలక్ట్రికల్ మినీ సబ్ స్టేషన్‌లో కాయిల్స్ చోరీకి గురయ్యాయని ఎత్తిపోతల పథకం బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు ఇంజినీర్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సొత్తు సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికే కొంతమంది కుట్ర చేసి చోరీకి పాల్పడినట్లు శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ గౌరీపతిరావు అభిప్రాయపడ్డారు.

స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

బెల్టుషాప్ సీజ్

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని జింకిభద్రలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై మంగళవారం దాడులు చేసి, షాపును సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లవరాజు తెలిపారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, 9 మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిపారు. అలాగే బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన సోదాల్లో రాజాం సమీపంలో నాటుసారా తరలిస్తున్న హేమరాజు, దుమ్ము ఘనగమ్మలను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి తొమ్మిది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటనలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేలంపాట వాయిదా

పోలాకి: మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని జీడి తోట ఫలసాయం పొందేందుకు ఈ నెల 18కి వాయిదా వేసినట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వేలం పాట నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఇందుకు ప్రభుత్వ పాటగా రూ.1,96,600 ప్రకటించారు. ఆ ధరకు పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో 18కి వాయిదా వేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్, కోడూరు పంచాయతీ పెద్దలు కరుకోలు రమేష్, గొర్లె యర్రయ్య పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ 2 రాజారావు

పక్కాగా నూతన మెనూ అమలు

పొందూరు: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నూతన మెనూ ట్రయల్ రన్‌ను పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఇఒ 2 పట్నాన రాజారావు పేర్కొన్నారు. మండలంలోని పుల్లాజీపేట, కేశవదాసుపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో మంగళవారం నూతన మెనూ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం రోజువారీగా సూచించిన ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు.

ఆకట్టుకున్న కచేరి

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో పది రోజులుగా చక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవం తృతీయ బ్రహ్మోత్సవ వేడుకలు కమనీయంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన మడమల రాంబాబు భాగవతార్ (రేడియో, టివి ఆర్టిస్టు) హరికథ గానం ఆహుతులను అలరించింది. అనంతరం రాత్రి ఏర్పాటు చేసిన శాస్త్రీయ సంగీత విభావరి సంగీత ప్రియులను ఒలలాడించింది. విజయవాడకు చెందిన లంక తేజస్విని గాత్రానికి సరస్వతుల పార్థివ వయొలిన్, కాకరాపర్తి జగన్మోహిని మృదంగం టిఎస్ చైతన్య మోర్సింగ్ గొనప లక్ష్మణమూర్తి కంజీరా తోడవడంతో కార్యక్రమం నభూతో నభవిష్యత్ అన్నట్టుగా సాగింది. పొందల కృష్ణారావు దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కచేరి నిర్వహిస్తున్న తేజస్విని

ఇసుక విధానంపై చర్చకు సిద్ధమా..?

'చింతాడ'కు టిడిపి సవాల్

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంపై వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ చర్చకు సిద్ధమా అని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు సవాల్ విసిరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇసుక విధానంపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. గత వైసిపి పాలనలో ఇసుక విధానంపై జరిగిన అవకతవకలు, అక్రమాలపై చింతాడ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. పట్టణంలోని చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తానని లక్ష సంతకాల ఉద్యమం పేరుతో ప్రజలను మభ్యపెట్టి గడచిన ఐదేళ్లలో కనీసం నోరు మెదపకుండా ఆ ఉద్యమాన్ని నీరుగార్చారని మండిపడ్డారు. ఇప్పుడు లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తూ కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టడానికి రకరకాల అవతారాలు ఎత్తుతూ విషం చిమ్ముతున్నారని అన్నారు. పొందూరు మండలం బొడ్డేపల్లి వద్ద ట్రాక్టర్లతో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు వద్దకు తన అనుచరులను పంపి డబ్బులు డిమాండ్ చేశాడని అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బొడ్డేపల్లి సత్యం ఆరోపించాడు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ, తమ్మినేని అప్పలనాయుడు, కంచరాన లోకేష్, హనుమంతు బాలకృష్ణ, తుప్పల గణపతి పాల్గొన్నారు.

నేడు క్లస్టర్ సముదాయాలు

టెక్కలి : విద్యాశాఖ ఆధ్వర్యాన బుధవారం క్లస్టర్ సముదాయాలు నిర్వహించనున్నారు. ఈ నెల చివరి వారంలో నిర్వహించాల్సిన సముదాయాలను ముందస్తుగానే నిర్వహిస్తున్నారు. వాస్తవంగా ఈ నెల 15న క్లస్టర్ సముదాయాలు నిర్వహిస్తామని సంబంధిత విద్యాశాఖ అధికారులు భావించారు. ఇందుకు సంబంధించిన కాలనిర్ణయ పట్టిక కూడా విడుదల చేశారు. అయితే అదే రోజు నుంచి ప్రభుత్వ పాఠశాలకు ఒంటి పూట బదులు నిర్వహిస్తుండడంతో సముదాయాలను ముందస్తుగా నిర్వహించేందుకు నిర్ణయించారు. ఉదయం పూట తరగతులు నిర్వహించి రెండో పూట క్లస్టర్ సముదాయాలకు హాజరయ్యే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా క్లస్టర్ సముదాయాల విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి కోరారు. అయినా సంఘాల మాటని పట్టించుకోకుండా పాఠశాలల సముదాయాలు నిర్వహించడం గమనార్హం.

సంక్షిప్త వార్తలు

గ్రంథాలయ పునర్వికాస జిల్లా కన్వీనర్‌గా సూర్యారావు

సూర్యారావు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా కమిటీలను రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా బూర్జ మండలం ఓ.వి.పేటకు బూడుమూరు సూర్యారావును నియమించారు. అలాగే డివిజన్ కన్వీనర్లుగా డాక్టర్ జామి భీమ శంకరరావు, బి.నర్సింగరావు, వేణుగోపాల్‌లు నియమితులయ్యారు. సభ్యులుగా సాహితీ స్రవంతి జిల్లా కన్వీన ర్ కె.శ్రీనివాసు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు, విశ్రాంత లైబ్రేరి యన్, జర్నలిస్టు దూరి గోపాలరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు నియమితులయ్యారు.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

మెళియాపుట్టి: వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ నిర్వహిస్తోందని ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం కింద 18-50 ఏళ్ల మధ్య వయసు ఉన్న వెనుకబడిన తరగతులు, కాపు (తెలగ, బలిజ, ఒంటరి), అగ్రవర్ణాల్లోని పేద మహిళలకు శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల సంప్రదించాలన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నందిగాం : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు టి.చిరంజీవి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి కార్యకర్తా జనసేన అధినేత పవన్‌కళ్యాణ ప్రసంగం కోసం తరలిరావాలని కోరారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

బూర్జ : మండలంలోని చీడివలసలో ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను టిడిపి నాయకులు బరి సూరప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. శివాలయానికి వెళ్లేందుకు సిసి రోడ్డును నిర్మిస్తున్నారు. ఎట్టకేలకు సిసి రోడ్డు నిర్మిస్తుండడంతో గ్రామస్తులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలోని కొతారికి చెందిన శివాలయం పూజారి వెంకట రావు రౌలో కుటుంబానికి పోలెండ్‌లో ఉన్న తెలుగు సంఘం ఆర్థికసాయం అందించింది. ఇటీవల భార్య మృతి చెందడం, వికలాంగ కుమారుడుతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న పోలాండ్‌లోని తెలుగు సంఘం సభ్యులు రూ.41 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సహదేవ్‌రెడ్డి, గ్రూప్ అడ్మిన్స్ తిప్పిన శేఖర్, నైన శ్యామ్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా 'సాయివినీత్' వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు: యువత సమాజ సేవకు అంకితం కావాలని సామాజిక వేత్త డాక్టర్ మంత్రి వెంకటస్వామి అన్నారు. మండలంలోని పూండిలో సాయివినీత్ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన యువతతరం సేవా సమితి 5వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆరు నుంచి 9వ తరగతి వరకు వివిధ మండలాల నుంచి వచ్చి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లీల, యువతర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి, కెంగువ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెలవారీ ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ఆమదాలవలస: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు నెలవారీ చేపట్టాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 ఏప్రిల్ నాటికి 22,723 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అప్పటి ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిందని తెలిపారు. వాటిలో 16,347 పోస్టులను డిఎస్‌సి కేటాయించిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, హెచ్.సత్యం, ఎస్.శ్రీనివాసరావు, ఎం.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

పలాస : పలాస-కాశీబుగ్గ డంపింగ్ యార్డును కమిషనర్ ఎన్.రామారావు మంగళవారం పరిశీలించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చెత్త నిర్వహణను, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియలను కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేసి వర్మీకంపోస్టును శాస్త్రీయ పద్ధతిలో తయారు చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ఆయనతో పాటు శానిటేషన్ సూపర్‌వైజర్లు సత్య, శ్రీను ఉన్నారు.

'సొండి'లను ఒబిసిలో చేర్చాలి

రణస్థలం: సొండిలను ఒబిసిలో చేర్చాలని సొండికుల సంక్షేమ సంఘం సభ్యులు నెమలిపురి రాంబాబు, మొగలపురి సుధాకర్, నెమలపురి బాలరాజు, శనాపతి వరప్రసాదరావు, నెమలపురి సతీష్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. రెండు రాష్ట్రాల్లో రెండు లక్షలకు పైగా సొండిలు ఉన్నారన్నారు. ప్రస్తుత పార్లమెంట్, శాసనసభలో దీనిపై ప్రకటన చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని విన్నవించారు.

జగన్ మాటలు నమ్మొద్దు

టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రహర్ష

మాట్లాడుతున్న ప్రహర్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అధికారం కట్టబెట్టిన యువతను గడచిన ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నట్టేట ముంచారని, ఇప్పుడు ప్రజలకు మోసపూరిత కట్టు కథలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12న యువత పోరు పేరుతో వైసిపి చేపడుతున్న కార్యక్రమం మరో మోసం చేసేందుకేనని ఆరోపించారు. ఫీజు రీఅంబర్స్‌మెంటు, వసతి దీవెన, విద్యాదీవెన పథకాల పేరిట రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారని అన్నారు. నిరుద్యోగులకు ఉపాది కల్పించడంలో పూర్తి వైఫల్యం చెందారన్నారు. కళాశాలల్లో విద్యార్థులు ఫీజులు చెలించలేని దుస్థితి కల్పించడమే కాకుండా పరీక్షల సమయంలో హాల్ టిక్కెట్లు కోసం ఇబ్బందులు పడేవారన్నారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సుమంత్, నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, కంచు నీలం, బగ్గ రవి పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఉపాధి హామీ సిబ్బంది ఎంపిడిఒ జి.రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మగతపాడు పంచాయతీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సక్రమంగా పనిచేయడం లేదని మాజీ సర్పంచ్ కె.రమేష్ ఫిర్యాదు చేశారు. చెరువు గట్టుపై మొక్కలు నాటారని, వాటి సంరక్షణకు నీరు పోయికపోవడంతో ఎండిపోతున్నాయని అన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌తో మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

మస్టర్లలో అవకతవకలు చోటు చేసుకున్నాయని చెప్పారు. దీనిపై ఎంపిడిఒ స్పందించి పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఎపిఒ రమణారావు, ఇఒపిఆర్‌డి పద్మావతి పాల్గొన్నారు.

ఎంపిపి పరామర్శ

కంచిలి : మండలంలోని రఘుపురానికి చెందిన గేదెల తుంభయ్య, నువాగడ కాలనీకి చెందిన నెమలిపురి తులసీదాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి దేవదాస్ రెడ్డి, లడ్డు కేశవ్ పాత్రో, కొనపల సురేష్ మంగళవారం మృతుల కుటుంబాలను కలిసి పరామర్శించారు. సందర్భంగా వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సర్పంచ్ సబితా గోమాంగో, జి.దాలయరెడ్డి, బి.ఢిల్లీరావు, జి.రామయ్య, ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట భానోజీనాయుడు

రణస్థలంలో గ్రామసభ

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీలో ఉపాధి హామీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు నిమిత్తం మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ నిధుల సక్రమంగా అందక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడ్డారని అన్నారు. కార్యక్రమంలో సోషల్ ఆడిటర్ ఎ.రాజు, సచివాలయాల ఫీల్డ్ అసిస్టెంట్లు, సెక్రటరీ చంద్రశేఖర్, విఆర్‌ఒ విక్రమ్, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, మాజీ సర్పంచ్ మహదాసు రమణయ్య, వాళ్లే రమణ, సొసైటీ మాజీ అధ్యక్షులు కరిమజ్జి మల్లేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఇచ్ఛాపురం : వేసవిలో తాగునీరు సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ ఎన్.రమేష్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీర్ విభాగం సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పురపాలక సంఘ పరిధిలోని వివిధ డ్రెయిన్లు, రోడ్లు, వీధి లైట్లు స్థితిగతులను పరిశీలించాలన్నారు.

బోరుకు మరమ్మతులు

పలాస : మండలంలోని కిష్టుపురంలో ఇటీవల బోరు పాడైంది. దీంతో గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో మరమ్మతులు చేపట్టారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవళ్లిక

ప్రజాశక్తి- బూర్జ

మహిళలు అని రంగాల్లోనూ తమదే పైచేయిగా రాణించాలని గ్రామీణ సహజ రైతు ఉత్పత్తిదారుల సంఘం మామిడి వెంకట సూర్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దలంకాంలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం పురుషుల కంటే దీటుగా, భవిష్యత్‌లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అనంతరం తహశీల్దార్ పద్మావతి, ఎస్ఐ ప్రవళ్లిక, మామిడివలస, చిన్నలంకాం, పెద్ద లంకాం సచివాల మహిళా ఉద్యోగులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామీణ సహస రైతు ఉత్పత్తిదారుల సంఘం సిఇఒ సిహెచ్.సూర్యనారాయణ, పెద్దపేట ఆర్ఫ్ స్వచ్ఛం సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, సిఇఒ శంకరరావు, కో-ఆర్డినేటర్ అనూప్, కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్లు, బోర్డు డైరెక్టర్లు, ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అనూష, రమలత పాల్గొన్నారు.

బెంచీల వితరణ

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌కు, పర్యాటకులకు విడిదిగా ఉండేందుకు వీలుగా సిద్ధి వినాయక వాకర్స్ సంఘం, దాతల సహకారంతో సిమెంట్ బెంచీలు వితరణగా మంగళవారం అందించారు. సుమారు రూ.30 వేలు విలువగల ఆరు సిమెంట్ బెంచీలను కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. మక్కా వెంకటరెడ్డి, మక్క గణపతిరెడ్డి జ్ఞాపకార్థం ఈ బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గంగారాప మల్లేశ్వరరావు, మక్కా మౌనిక, మక్క భీమేశ్వర్‌రెడ్డి, మక్క గంగాధర్‌రెడ్డి, కోరాడ రాంప్రసాద్, టంకాల వెంకటరమణ, దవళ కృష్ణారావు, ప్రదాన ఆదినారాయణ పాల్గొన్నారు.

బెహరా మనోవికాస కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారతీయ హ్యూమన్ రైట్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు పూర్ణచంద్ర సాహు సోమవారం నగరంలోని బెహరా మనో వికాస కేంద్రాన్ని సందర్శించారు. మనో వికాస కేంద్రంలో మానసిక వికలాంగులైన పిల్లల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కేంద్రం నిర్వాహకురాలు బెహర శ్యామలతో మాట్లాడారు. నిత్యం వారికి శుభ్రం చేయడం, సకాలంలో అందిస్తున్న భోజన

కేంద్రాన్ని పరిశీలిస్తున్న పూర్ణచంద్రసాహు

సదుపాయాలు, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, మణిశర్మ, ఎపి డబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.